19 నుంచి వేసవి వెన్నెల ఉచిత శిక్షణ శిబిరం

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో వేసవి వెన్నెల ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఇందులో అన్నమాచార్య సంకీర్తనలు, సంగీత మెళకువలు, ఆత్మ వికాస విషయాలను ఉచిత శిక్షణ తరగతులలో నేర్పించనున్నారు. రోజూ సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు. మార్చి 19వ తేదీ నుంచి మార్చి 25వ తేదీ వరకు 6 రోజుల పాటు శిక్షణ తరగతులు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. వివరాలకు కె.సౌజన్యను ఫోన్: 95501 29946లో, కె.రాజరాజేశ్వరీ దేవిని ఫోన్: 94412 76825లో సంప్రదించవచ్చన్నారు.

నేడు పోస్టాఫీసు ప్రారంభోత్సవం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌కు మంజూరైన పోస్టాఫీసు కార్యాలయాన్ని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు శనివారం ప్రారంభించనున్నారు. ఎన్నికల సమయంలో స్థానికుల కోరిక మేరకు మున్సిపల్ పరిధిలోని అంబేడ్కర్ కాలనీలో పోస్టాఫీసును మంజూరు చేయించారు. అయితే దానిని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేస్తే అందరికీ అనువుగా ఉంటుందని కొందరు స్థానికులు కోరుతున్నారు.

22న హరి కీర్తన, భజన..

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 22న హిందూ సమాజ సేవ నవయువక్ సంఘ్ వారి ఆధ్వర్యంలో 24 గంటల హరి కీర్తన భజన నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కార్పొరేటర్‌ను నిర్వాహకులు కలిసి పూజలో పాల్గొనాలని ఆహ్వానించారు.

మాజీ మంత్రి హరీశ్‌ను కలిసిన బీఆర్ఎస్ శ్రేణులు



మాజీమంత్రిని కలిసిన బీఆర్ఎస్ శ్రేణులు

పటాన్‌చెరుటౌన్: మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును హోలీ పండుగ నేపథ్యంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ సోమిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆదర్శ్ రెడ్డి శుక్రవారం మాజీమంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

సమస్యలను గుర్తించాలి

మోతీనగర్: సంక్షేమ సంఘాల నాయకులు స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం సూచించారు. గాయత్రీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వి. కృష్ణారావు తన ప్యానెల్ సభ్యులతో కలిసి శుక్రవారం మర్యాదపూర్వకంగా ఆమెను కలిశారు. ఈ సందర్భంగా ఆమె సంక్షేమ సంఘం ప్రతినిధులను పూలమాలతో సన్మానించారు. సంక్షేమ సంఘం ప్రతినిధులు కార్పొరేటర్‌కు పండ్లు, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కే. ప్రేమ్‌కుమార్, కోశాధికారి బి. శ్రీలత, జాయింట్ సెక్రటరీ విష్ణు, ప్రధాన కార్యదర్శి రమణాచారి, నాయకులు జయ, లక్ష్మణ్ గుప్తా, బి. జితేంద్ర, నందు, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సభ జయప్రదం కావాలని పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న మున్నూరు కాపు సంఘం నేతలు

అల్విన్‌కాలనీ: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ మైదానంలో ఈనెల15న నిర్వహించనున్న మున్నూరు కాపు సభ జయప్రదం కావాలని కోరుతూ ఆ సంఘం నేతలు తెల్ల హరికృష్ణ పటేల్, నిరంజన్ పటేల్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి, వివేకానందనగర్ డివిజన్‌లోని కనకదుర్గమ్మ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేములవాడ మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రం ఉపాధ్యక్షుడు చింతపంటి భూమయ్య పటేల్, మూసాపేట మాజీ సర్పంచ్ తూము శ్రీనివాస్ పటేల్ ఆదేశాల మేరకు ఆలయ ప్రాంగణంలో బాగ్‌అమీర్, కూకట్‌పల్లి మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు అల్లం మహేశ్ కుమార్ పటేల్, కార్యదర్శి ఆకుల బాలకృష్ణ పటేల్, కోశాధికారి మన్నె కమలాకర్ పటేల్‌తో కలిసి కార్యాచరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా తెల్ల హరికృష్ణ పటేల్ మాట్లాడుతూ.. కూకట్‌పల్లి సర్కిల్ 12 డివిజన్లలోని కులస్తులందరు సభకు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో చింతపంటి భూమయ్య పటేల్, తూము శ్రీనివాసరావు పటేల్, సురేశ్, కిరణ్, వేణు, శేఖర్, వీరేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



హోలీ సంబరాల్లో ఐటీ ఉద్యోగులు



రంగులు చల్లుకుంటున్న మహిళలు



కొండాపూర్ శిల్పాగార్డెన్‌లోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో...

హోలీ.. జాలీ

అంబరాన్నంటిన సంబురాలు

డీజేలు, రెయిన్ డ్యాన్స్‌లు హుషారెత్తించిన యువత

వాడవాడలా సందడి చేసిన చిన్నారులు



మదీనాగూడలో..



చందానగర్ సర్కిల్ పరిధిలో జీహెచ్ఎంసీ కార్మికులు



కొండాపూర్ టీజీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్‌లో కమాండెంట్ రామకృష్ణ

ఎక్కడ చూసినా హోలీ జోష్ కనిపించింది. శేరిలింగంపల్లిలోని కాలనీలు గేటెడ్ కమ్యూనిటీలు, బస్తీలలో హోలీ పండగను అంగరంగ వైభవంగా నిర్వహించుకుకున్నారు. మహిళలు, చిన్నారులు, ఐటీ ఉద్యోగులు రంగులు చల్లుకొని పండగ చేసుకున్నారు. కొండాపూర్ టీజీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్‌లో కమాండెంట్ రామకృష్ణ సిబ్బందితో కలిసి హోలీ సంబరాలలో పాల్గొన్నారు. ఐటీ కారిడార్‌లో దాదాపు 20 చోట్ల అనుమతులు తీసుకొని డీజేతో డ్యాన్సులు, కిడ్స్ కార్నర్స్, రెయిన్ డ్యాన్స్‌లతో అదరగొట్టారు. – గచ్చిబౌలి



మాదాపూర్ ఐటీ కారిడార్‌లో సినీ హీరోయిన్ నిధి అగర్వాల్



నల్లగండ్ల అపర్ణా గ్రాండేలో..





నల్లగండ్ల అపర్ణా గ్రాండేలో...



తారానగర్‌లో..



గౌలిదొడ్డి కేశవనగర్‌లో..

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

నలుగురు కొనుగోలుదారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ: గేటెడ్ కమ్యూనిటీ ప్రాంతాలను అడ్డాగా చేసుకుని గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులతో పాటు మరో నలుగురు కొనుగోలుదారులను కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ రెడ్డితో కలిసి శుక్రవారం వివరాలు వెల్లడించారు. గురువారం సాయంత్రం కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లోని ఇందూ ఫార్చ్యూన్ ఫీల్డ్స్ అపార్టుమెంట్ వద్ద ఖాళీ స్థలంలో గంజాయి అమ్ముతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఉన్నతాధికారుల అనుమతి మేరకు ఎస్ఐ మౌనిక రెడ్డి, సిబ్బంది, క్లూస్ టీంతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని తుమ్మల ఆశిష్ కుమార్ (29), కట్టింపూడి సాత్విక్ (20)ను అదుపులోకి తీసుకుని వారి జ్యూట్ బ్యాగ్‌ను పరిశీలించగా గాజు పాత్రలో భద్రపర్చిన కుష్ గంజాయిని, డబ్బాలో ఉంచిన 7500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ముంబైకి చెందిన ఆశిష్‌కుమార్‌ను విచారించగా తనకు గంజాయి సేవించే అలవాటు ఉందని, గతే ఏడాదిగా ముంబైలో కొనుగోలు చేసి హైదరాబాద్‌లో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. ఇదే కేసులో ఒకసారి పట్టుబడి బెయిల్‌పై బయటకు వచ్చాడు. మళ్లీ అదే బాటలో నడుస్తున్నాడు. ఈనెల 10న తన స్నేహితుడు సాత్విక్‌ను ముంబైకి పంపించి 260 గ్రాముల కుష్ గంజాయి, 1100 గ్రాముల గంజాయి తీసుకుని ఆశిష్‌కు ఇచ్చాడు. దాన్ని చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి గురువారం తెలిసిన కొంతమంది యువకులకు అమ్మేందుకు ప్రయత్నించగా పోలీసులు ఆశిష్, సాత్విక్‌ను పట్టుకోగా గంజాయి కొనేందుకు వచ్చిన నలుగురు యువకులను పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 260 గ్రాముల కుష్ గంజాయి, 1100 గ్రాముల గంజాయి, 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ. 5 లక్షల పైగా ఉంటుందని సమాచారం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

5కే రన్‌కు రండి



మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న నిర్వాహకురాలు శిరీష సత్తూర్

అల్విన్‌కాలనీ: తులసీవనంలోని అవని ట్రస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న ఉదయం 6 గంటలకు 5కే రన్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకురాలు శిరీష సత్తూర్ ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మాజీ మంత్రి మధుయాష్కీగౌడ్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. 5కే రన్‌కు హాజరుకావాలని కోరుతూ ఆహ్వానపత్రికను అందజేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న పండితులు

రాయదుర్గం: నానక్‌రాంగూడ ఔటర్‌రింగురోడ్డు సర్వీస్ రోడ్డులో వెలిసిన అభయాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఆలయంలో ఉదయం ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, అలంకారం చేశారు. అనంతరం ఆలయంలో నూతనంగా దక్షిణామూర్తి, రాధాకృష్ణులు, దత్తాత్రేయ స్వామి, వారాహి మాత విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలను అర్చకుల మంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం పలు హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకుడు అభిషేక్ గౌడ్, ప్రముఖ యాంకర్ సుమ, డాక్టర్ శిరీష, డీసీపీలు శ్రీదేవి, సింధు, యాదయ్య, ఆలయ నిర్వాహకులు జక్కుల యాదవరావు, నర్సింగ్‌రావు, రమేష్, సహదేవ్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీ చైతన్య మహాప్రభు 539వ ఆవిర్భావ తిథి అంగరంగ వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా అత్తాపూర్‌లోని ఇస్కాన్ ఆలయం హరే కృష్ణ నామ జపంతో మార్మోగిపోయింది. కార్యక్రమంలో ఐదు వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. జయంతి ఉత్సవాల్లో భాగంగా ఉదయం 7.30 గంటలకు దర్శన హారతి నిర్వహించారు. 8 గంటల నుంచి శ్రీ చైతన్య మహాప్రభు లీలలపై ఆధ్యాత్మిక ప్రవచనాలు జరిగాయి. సాయంత్రం మహా అభిషేకం, చప్పన్ భోగ్ నైవేద్యం, గౌర హారతి అందించారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

అత్తాపూర్: శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు కోరారు. సులేమాన్‌నగర్ డివిజన్‌లో శుక్రవారం స్థానికులకు అవగాహన సదస్సును నిర్వహించారు. రానున్న రంజాన్ పండగను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

లింకు రోడ్డు నిర్మాణం ఎప్పుడో?



పాత ముంబయి జాతీయ రహదారిని నల్లగండ్లలో కలిపే లింకు రోడ్డు ఇదే...

- ఇప్పటికీ పూర్తికాని భూసేకరణ
- టెండర్ ప్రక్రియ పూర్తయినా ముందుకు సాగని వైనం
- 1.8 కిలోమీటర్ల రోడ్డుకు రూ. 21.34 కోట్ల వ్యయం
- ఇదీ పాతముంబయి జాతీయ రహదారి – నల్లగండ్ల లింకురోడ్డు పరిస్థితి'

శేరిలింగంపల్లి: నగర శివారులో విశేష ప్రాధాన్యత కలిగిన శేరిలింగంపల్లిలో మరో లింకు రోడ్డు పరిస్థితి అయోమయంగా మారింది. ప్రభుత్వం మారడంతో దీని ప్రాధాన్యత తగ్గిపోయింది. నిధుల సమస్యతో ఇప్పట్లో ఈ పనులు చేపట్టే పరిస్థితులు కనిపించడం లేదని స్థానికులు భావిస్తున్నారు.

- నగరంలో అత్యధికంగా లింకు రోడ్లు నిర్మించిన ప్రాంతంగా శేరిలింగంపల్లికి పేరొచ్చిన విషయం తెలిసిందే. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే పాత ముంబయి జాతీయ రహదారికి నల్లగండ్లకు మధ్య దూరాభారం మరింత తగ్గే అవకాశం ఎక్కువగా ఉండేది. కొత్త రూట్ కూడా ఏర్పడినట్లయ్యేది. కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు నల్లగండ్ల, తెల్లాపూర్, గోపన్‌పల్లి, గోపన్‌పల్లి తండా పరిసరాల్లో వెలుస్తున్న నేపథ్యంలో ఈ రోడ్డుకు ప్రాధాన్యత పెరిగే అవకాశం ఉంది. దూరాభారంతోపాటు సమయం ఆదా అయ్యే అవకాశం ఉండేది. కానీ ప్రభుత్వం ఈ రోడ్డుకు మోక్షం కలిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

కొత్త లింకురోడ్డు వివరాలివీ..

పాత ముంబయి జాతీయ రహదారి–నల్లగండ్లలోని రత్నదీప్ సూపర్ మార్కెట్ మధ్య కొత్త లింకు రోడ్డు.

- జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి కార్యాలయం ముందున్న పాత ముంబయి జాతీయ రహదారికి మున్సిపల్ కారాలయం, ఆలింద్, నల్లగండ్ల లేక్ మీదుగా నల్లగండ్లలోని రత్నదీప్ సూపర్ మార్కెట్ ముందున్న రోడ్డుకు లింకురోడ్డుగా నిర్మిస్తారు.
- కొత్త లింకు రోడ్డును 1.8 కిలోమీటర్ల నిర్మించాలని నిర్ణయించారు.
- ఈ రోడ్డుకు రూ. 21.34 కోట్ల వ్యయం వ్యయం అవుతుందని అంచనా.
- 100 ఫీట్ల రోడ్డుగా డివైడర్, సెంట్రల్ లైటింగ్, గ్రీనరీ, రెండువైపులా డ్రై నేజీ, ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేయాలని ప్రతిపాదించారు.
- నాలుగు లేన్ల రోడ్డుగా నిర్మించాలని నిర్ణయించారు.
- ఈ రోడ్డును హెచ్ఆర్‌డీసీఎల్ సంస్థ నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తుందని అప్పట్లో ప్రకటించారు.
- రోడ్డు నిర్మాణాన్ని 9 నెలల్లోనే పూర్తి చేయాలని కూడా నిర్ధారించారు.
- ఇప్పటికే టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు.
- ఇకనైనా పాత ముంబయి జాతీయ రహదారి–నల్లగండ్ల రత్నదీప్ సూపర్ మార్కెట్ వరకు నిర్మింప తలపెట్టిన లింకు రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



గచ్చిబౌలి: విద్యుత్ సబంధ మరమ్మతు పనుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గచ్చిబౌలి ఏఈ భాస్కర్ తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు జర్నలిస్ట్ కాలనీ, ఫైర్ స్టేషన్, 60 యార్డ్స్, నానక్‌రాంగూడ విలేజ్, ఎస్సీ బస్తీ, పద్మశ్రీ గార్డెన్, ఐఎల్ఎస్ పార్క్, జేవీ కాలనీ, గౌలిదొడ్డి విలేజ్, అపర్ణ శాంగ్రిల్లా, కేశవ్‌నగర్, జేయభేరీ ఫేజ్-4, టీఎన్‌జీవోస్ కాలనీ, కొమరంభీం, శ్రీరాం స్కూల్, ఎమ్రాల్డ్ గార్డెన్, సుమధుర అపార్ట్‌మెంట్స్, జయభేరీ మిడోస్, జయభేరీ అరేంజ్ కౌంటీ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, కేంబ్రిడ్జ్ స్కూల్, ఎల్ అండ్ టీ పార్క్, సాయిబాబా టెంపుల్, టెలికాంనగర్, జయభేరీ ఎన్‌క్లేవ్, ఏపీహెచ్‌బీ కాలనీ, ఓల్డ్ గచ్చిబౌలి, రాయదుర్గం, మధురానగర్, సాయి ఐశ్వర్య అపార్ట్‌మెంట్స్, ఖాజాగూడ, ఏసీ అట్లాంటిక్ అపార్ట్‌మెంట్స్, వీకర్ సెక్షన్, సెక్రటేరియట్ కాలనీ, మహిళా మండలి, గాయత్రి నెస్ట్, ఆర్‌టీటీసీ, కాళోజీ చౌరస్తా, అలాయ్ బలాయ్ చౌరస్తా, ప్రశాంతి హిల్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

మాదాపూర్ పరిధిలో...

మాదాపూర్: మాదాపూర్‌లోని పలు ప్రాంతాలలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. 11కేవీ ఫీడర్, రోడ్డు వైండింగ్ పరిధిలో మధ్యాహ్నం ఒంట గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్ఐఏ, మెరీడియన్ స్కూల్ పరిసర ప్రాంతాలు, ఎస్ కన్వెన్షన్, బుట్టా కన్వెన్షన్, సూర్య ఆఫీస్, సలీమ్ టీ స్టాల్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

చందానగర్ పరిధిలో...

చందానగర్: చందానగర్ సెక్షన్ పరిధిలోని హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.

- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.
- మార్తాండనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని తెలిపారు.

హఫీజ్‌పేట్ సబ్ స్టేషన్ పరిధిలో..

హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ ఉండదని ఏఈ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

- శ్రీలా ఫీడర్, విశ్వంభర ఫీడల్‌ల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

వేమనకాలనీ సెక్షన్‌లో..

వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధి భవానీపురం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- ఎస్టీపీ ప్లాంట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.
- సురక్షా ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామన్నారు.
- ఫ్రెండ్స్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తానారు.

శేరిలింగంపల్లి పరిధిలో..

శేరిలింగంపల్లి: 11 కేవీ ఎన్‌టీఆర్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని నల్లగండ్ల ఏఈ వెంకట్ నారాయణరెడ్డి తెలిపారు.

- 11 కేవీ దూబే కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.